సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 19 । ఆగస్టు । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 20.538 టీఎం సీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 686 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,230
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.5,409
3 శాతం జీఎస్టీతో	రూ.5,571
నవర (8 గ్రాములు)	రూ.44,568

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.9 /29.5

శుక్రవారం గాలిలో తేమ 42 శాతం ఉంది. శనివారం ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు తగ్గే ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

రూ.8 లక్షల విలువైన వెండి నగలు సీజ్



బిల్లులు లేకుండా వెండి నగలు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సెబ్ అధికారులు

వెంకటాచలం: బిల్లులు లేకుండా రూ.8 లక్షల విలువ చేసే 10 కేజీల వెండి నగలను బస్సులో తరలిస్తుండగా సెబ్ అధికారులు వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం పట్టుకున్నారు. నెల్లూరు వైపు నుంచి తమిళ నాడు వెళుతున్న ఆర్టీసీ బస్సులో సెబ్ సీఐ నరహరి ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టగా ఓ యువకుడి బ్యాగులో 10 కేజీల వెండిని గుర్తిం చారు. బిల్లులు అడిగితే చూపలేదు. దీంతో వాటిని తరలిస్తున్న నెల్లూరులోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన షేక్ నౌషాద్‌ను అదుపు లోకి తీసుకున్నారు. వెండి నగలను సీజ్ చేసి వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు

ఉదయగిరి: దాడి కేసులో నేరం రుజువు కావ డంతో ముగ్గురు ముద్దాయిలకు ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి జె.అంజయ్య రెండేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఉదయగిరి సీఐ వి.గిరిబాబు శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2018 డిసెంబర్ 14న దుత్తలూరుకు చెందిన డబ్బుగొట్టు హాజరత్తయ్య కుమారుడు కులాంతర వివాహం చేసుకున్నాడు. దానిని జీర్ణించుకోలేని యువతి తరఫు బంధువులైన కంభం రఘురామయ్య, కంభం సుబ్బారెడ్డి, కంభం చినసుబ్బారెడ్డిలు హాజరత్తయ్య కుటుంబంపై దాడి చేశారు. ఈ విషయమై అప్పట్లో దుత్తలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు విషయంలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ముద్దాయిలకు రెండేళ్ల జైలు శిక్ష విధించారు.

సహకార రంగానికి పునరుజ్జీవం

- రూ.295 కోట్ల షేర్ క్యాపిటల్ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- గత పాలకులు విజయ డెయిరీని నిర్వీర్యం చేశారు
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సహకార సంఘాల సభ్యుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో సహకార రం గాన్ని బలోపేతం చేయాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నష్టాల్లో ఉన్న డీసీసీబీలకు రూ.295 కోట్ల షేర్ క్యాపిటల్ ఇచ్చి వాటి పునరు జ్జీవానికి కృషి చేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మం త్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని టౌన్‌హాల్‌లో శుక్రవారం జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలన, నిర్వహణపై డీసీసీబీ, సహకారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులకు సంబంధించిన బ్రోచర్‌ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రైతుల విస్తృత ప్రయోజనాలే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను బలో పేతం చేయడంతోపాటు డీసీసీబీలను మరింత పటిష్టపరిచేందుకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా మన జిల్లాలో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు డీసీసీబీకి రూ.40 కోట్ల షేర్ క్యాపిటల్ కేటాయించిందని తెలిపారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని డీసీసీబీలతోపాటు నెల్లూరు డీసీసీబీ లాభాల బాటలో పయనిస్తోందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖ రరెడ్డి సహకార రంగాల ఉన్నతికి ఎంతో కృషి చేశారని, అయితే అనంతరం వచ్చిన పాలకుల తప్పుడు నిర్ణయాలు, అవినీతి, అసమర్థత వల్ల సహకార రంగం గాడి తప్పిందని పేర్కొన్నారు. గతంలో విజయ డెయిరీకి దేశంలో మంచిపేరు ఉం డేదని, కానీ గత పాలకులు ఆ డెయిరీని నిర్వీర్యం చేశారని గుర్తుచేశారు.

లాభాల బాటలో..

రాష్ట్రంలో 13 డీసీసీబీలు, 20 వేలకు పైగా సహకార సంఘాలు, జిల్లాలో 78 ప్రాథమిక వ్యవసాయ కోఆ పరేటివ్ సొసైటీలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అన్ని డీసీసీబీలను లాభాల బాటలోకి తీసుకువ చ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రె డ్డికే దక్కిందన్నారు. సహకార సంఘాలు పెట్రోల్ బంకులు, జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటు చేసేందుకు డీసీసీబీలు తక్కువ వడ్డీకే ఆర్థిక సహ కారం అందిస్తున్నాయని తెలిపారు. ఈ–క్రాప్ బుకింగ్ ద్వారా ఎలాంటి పొరపాట్లు, అవినీతికి తావులేకుండా రైతులకు పారదర్శకంగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్బీకేల ద్వారా సకాలంలో రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్త నాలు, పురుగుమందులు అందిస్తున్నామన్నారు. రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా గోదాములు నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం డీసీఓ సుధాభారతి, డీసీసీబీ సీఈఓ డాక్టర్ శంకర్ బాబులతోపాటు పలువురు ప్రముఖులు, రైతులు మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ గణేషన్, జాయింట్ రిజిస్ట్రార్ రాధిక మాధవి, శ్యాంకుమార్, శ్రీనివాస్, ప్రకాశం జిల్లా డీసీఓ రాజశేఖర్, నాబార్డ్ డీడీఎం రవిసింగ్, డీసీసీబీ అధికారులు, సహకార సంఘాల చైర్మన్లు, సీఈఓలు, సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జగన్మాతా నమోస్తుతే

- శ్రావణమాస తొలి శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు
- భక్తులతో కిక్కిరిసిన అమ్మవారి దేవస్థానాలు



నెల్లూరు(బృందావనం): శ్రావణమాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలో వివిధ రూపాల్లో కొలువైన అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. నగ రంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం లో సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. సింహపురి గ్రామదేవత శ్రీఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, బాలాజీ నగర్ శ్రీసీతారామస్వామి ఆలయంలో, వేదా యపాళెం మహాత్మాగాంధీ నగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో, సుజాతమ్మకాలనీ అవధూత దత్త పీఠశాఖ శ్రీకృష్ణయోగమందిరం ప్రాంగణం లోని అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవార్లకు క్షీరాభి షేకాలు, విశేష అలంకరణలు, కుంకుమపూ జలు నిర్వహించారు. ఆయా ఆలయాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

- తొలి రోజు సర్వభూపాల, కల్పవృక్ష వాహనాలపై విహరించిన స్వామివారు



సర్వభూపాల వాహనంపై వెంకయ్యస్వామి

వెంకటాచలం: భగవాన్ శ్రీవెంకయ్యస్వామి 41వ ఆరాధనోత్సవాలు వెంకటాచలం మండలం గొలగ మూడిలో శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభమ య్యాయి. గోపూజ, గణపతిపూజ, అంకురార్పణ, కల శస్థాపన, శిఖర సంప్రోక్షణలతో అర్చకులు ఆరాధనో త్సవాలను ప్రారంభించారు. తొలిరోజు స్వామివారిని సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ఓం నారాయణ.. ఆదినా రాయణ నామస్మరణతో భజనలు చేశారు. చిన్నా రులు, మహిళలు కోలాటాన్ని ప్రద ర్శించారు. అలాగే రాత్రి స్వామివారికి కల్పవృక్ష వాహనసేవ కనులపం డువగా నిర్వహించారు. రెండో రోజు శనివారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 9 గంటలకు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

లక్ష్యాలను సాధించడంలో ఇంత నిర్లక్ష్యమా..!

- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ శివప్రసాద్



మాట్లాడుతున్న రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ శివప్రసాద్

నెల్లూరు(పొగతోట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన పేదల సొంతింటి కల సాకారం చేయడంలో క్షేత్రస్థాయి అధికారులు కథలు చెబితే వినే ప్రసక్తే లేదని, నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గృహ నిర్మాణ సం స్థ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ఎంపీడీఓలు, డీఈలు, ఏఈలు, సచివాల య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీలు చేసే సమయంలో ఒత్తిళ్లు చేసి ఉన్న ప్రాంతాల్లోనే కొనసాగుతున్నారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధిం చడంలో ఎందుకంత నిర్లక్ష్యమంటూ కావలి, ఆత్మకూరు అధికా రులపై అసహనం వ్యక్తం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలను 10 రోజుల్లోపు పూర్తి చేయకపోతే శ్రీకాకుళం బదిలీ చేస్తానంటూ హెచ్చరించారు. వచ్చే నెల మొదటి వారంలో గృహ ప్రవేశాలకు సంబంధించి ప్రారంభోత్సవాలు ఉన్నందున నిర్మాణాలను వేగ వంతంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 14,560 గృహాలు మంజూరు కాగా 11,300 పూర్తి చేసినట్లు తెలి పారు. మిగిలిన వాటిని నిర్దేశించిన సమయం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తప్పుడు లక్ష్యాలను నివేదించడంపై అధికారులపై మండిపడ్డా రు. రోజుకు 200 ఇళ్ల లక్ష్యంగా నిర్దేశిస్తే 25 ఇళ్లు పూర్తి చేస్తున్నారం టూ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకట్రావ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ పీడీ, మున్సి పల్ అధికారులు, ఎంపీడీఓలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని ఓర్వలేకున్న బాబు, పవన్



సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రసన్నతో కలిసి పాలాభిషేకం చేస్తున్న ఐకేపీ సిబ్బంది

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉండడాన్ని చూసి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఓర్వలేక కుట్రలు, కుతంత్రాలకు తెరలేపుతున్నారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం మొత్తం సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి, సంక్షేమ పాలనపై ప్రశంసల జల్లులు కురిపిస్తుండగా, బాబు, పవన్ మాత్రం గగ్గోలు పెడుతున్నారన్నారు. గత చంద్రబాబు పాలనలో అవినీతి, అక్రమాలపై నోరు మెదపని పవన్ నేడు సంక్షేమ ప్రభుత్వంపై పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఐకేపీ ఉద్యోగుల జీతాలను 23శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కోవూరు పంచాయతీ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రసన్నతో కలిసి శుక్రవారం పాలాభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఐకేపీలో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో వైఎస్సార్ పాలన లో తమకు హెచ్‌ఆర్ అమలు చేశారని చెప్పారు. ఆ తరువాత ఎవరూ పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ తాము ఊహించని విధంగా జీతాలను పెంచారని ఆనందం వ్యక్తం చేశారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ఆత్మకూరు రెవెన్యూ సమస్యలపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ ఆత్మకూరు నియోజకవర్గ రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ సమక్షంలో గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో ప్రజలు విన్నవించిన సమస్యల పరిష్కార పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా వినతులు అందాయని తెలిపారు. వాటిలో నిబంధనల మేరకు చేయగలిగేవి ఉంటే త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. మిగిలిన వాటిని ఎందుకు పరిష్కరించ లేకపోతున్నామనే విషయాన్ని అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో రెండో విడతలో ఆరు వేల ఎకరాల భూములను నిషేధిత జాబితాలో గుర్తించారని, వాటిని తొలగించేలా చూడాలన్నారు. అనంతసాగరం- మర్రిపాడు మధ్యన ఎస్‌హెచ్ 67 నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్‌ను కోరారు. ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి, ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడీ హనుమాన్‌ప్రసాద్, మండల తహసీల్దార్లు, సర్వేయర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు

• ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు కనిపిస్తున్నాయని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గణేశ్వరపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు, ప్రజాసమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో హెల్పర్ సురేష్ పనితీరుపై పలువురు ఫిర్యాదు చేశారు. పాత విద్యుత్‌లైన్లను పునరుద్ధరించాలని కోరారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ, ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. గతంలో టీడీపీ జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటేనే సంక్షేమ పథకాలు అందేవని గుర్తు చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేస్తోందని వివరించారు. తొలుత రాజగోపాల్‌రెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలతో సత్కరించారు. పార్టీ యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, పార్టీ మండల కన్వీనర్ ఆంధ్రా బాలగురవారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామాంజనేయులు, వైస్ ఎంపీపీ పీ మధు, సర్పంచ్ వడ్లపల్లి తిరుపతయ్య, నాయకులు కామేపల్లి వెంకటరత్నం, బోగినేని శ్రీనివాసులు, గంగవరపు పుల్లయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.37
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.7



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.134
లేయర్	: రూ.105
బ్రాయిలర్ చికెన్ :	రూ.238
స్కిన్‌లెస్ చికెన్ :	రూ.258
లేయర్ చికెన్ :	రూ.178



రాష్ట్ర సమగ్రాభివృద్ధే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం



సంక్షేమ పథకాలు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : రాష్ట్ర సమగ్రాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 22వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర స్థితిగతులను క్షుణ్ణంగా అధ్యయనం చేయడం ద్వారా ఏర్పరుచుకున్న అవగాహనతో అన్ని రంగాల్లో ప్రగతి సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. చంద్రబాబు మాదిరిగా చెత్తబుట్టలో పడేయకుండా ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 99 శాతానికిపైగా నెరవేర్చారని వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలను ఇంటింటికి పంపి మేనిఫెస్టోను ప్రతిఒక్కరి చేతుల్లో పెడుతూ ఆశీర్వదించండి అని సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారన్నారు. విద్యతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు, ఇతర పరిశ్రమల నిర్మాణం ద్వారా యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు చేపడుతున్నారని వివరించారు. గత ప్రభుత్వ, ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని తేడాను ప్రజలు గమనించాలని కోరారు. గతంలో ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలు నష్టాల్లో ఉన్నాయని తన ఎల్లో మీడియాలో ఫేక్ వార్తలు రాయించి, వాటిని ప్రజలు నమ్మారనే అభిప్రాయానికి రాగానే తన తాబేదారులకు కారు చౌకగా కట్టబెట్టిన దౌర్భాగ్యపు చరిత్ర చంద్రబాబుది అని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు భారీ జీతాలు ఎందుకని చంద్రబాబు తక్కువ జీతాలకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించారని తెలిపారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడమే కాకుండా జీతాలు పెంచి న్యాయం చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, కాటా శ్రీనివాసులురెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, షేక్ సాహుల్ హమీద్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల వ్యక్తిగత వివరాలు అడగొచ్చా..?




స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్


• నగర ఎమ్మెల్యే పీ అనిల్ కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వం నియమించిన వలంటీర్లపై దుష్ప్రచారం చేస్తున్న కొందరు ఏ సంబంధం లేకుండా ఇంటింటికి వెళ్లి ఓటర్ల వ్యక్తిగత వివరాలు అడగొచ్చా..? అని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ ప్రశ్నించారు. నగరంలోని 43వ డివిజన్ కుమ్మరివీధి, హల్లీం మసీదువీధి డైకస్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో అధికార పార్టీ దొంగ ఓట్లను వెరిఫికేషన్ చేస్తున్నామని కొందరు వారం రోజులుగా మాట్లాడుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నగరంలో డబుల్ ఎంట్రీలు ఉన్నాయని, ఆ విషయాన్ని 2019 ఎన్నికలకు ముందే తాను చెప్పానని గుర్తుచేశారు. దొంగ ఓట్లు చేర్పించుకునే సామర్థ్యం విద్యాసంస్థలు కలిగిన నారాయణకు మాత్రమే ఉందని ఆరోపించారు. ఓటర్ల వెరిఫికేషన్ అంటే డబుల్ ఎంట్రీ, వలస పోయిన, చనిపోయిన వారి ఓట్లను గుర్తించడం, అసలు అడ్రస్‌లో ఉన్నారా..లేదా అనే దానిపై మాత్రమే చేయాలన్నారు. దొంగ ఓట్లు తొలగించాలనుకున్న వారు ఆ పనిచేయకుండా, ఏ పార్టీకి చెందిన వారని ఓటర్లను ఎందుకు ఆరాతీస్తున్నారని టీడీపీ నాయకులను ఆధారాలతో ప్రశ్నిస్తున్నామన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ రాఖీని అమ్మవారి వద్ద 40 రోజుల పాటు పెట్టి పూజ చేసి కంకణం కట్టుకుంటే ఏదైనా సమస్య వచ్చినప్పుడు పిలిస్తే వస్తానని చంద్రబాబునాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మానసిక పరిస్థితి ఏ విధంగా ఉందో ప్రజలు అర్థం చేసుకోవచ్చన్నారు. ఎవరైనా తన పార్టీ గెలిచి ముఖ్యమంత్రి కావాలని భగవంతుడ్ని కోరుకుంటారని, కానీ ఒకాయన పార్టీ ఏర్పాటు చేసి ఆయన ముఖ్యమంత్రి కావాలని కోరుకోకుండా జగన్‌మోహన్‌రెడ్డి గెలవకూడదని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి వారిని భగవంతుడు కూడా క్షమించడన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మోటార్‌బైక్‌ను ఢీకొన్న వ్యాన్



మనోహర్ మృతదేహం

• మరో వ్యక్తికి తీవ్రగాయాలు

కావలిరూరల్: పట్టణంలోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కావలి రెండో పట్టణ సీఐ సుధాకర్ రావు తెలిపిన వివరాల మేరకు.. జలదంకి మండలం చౌడవరానికి చెందిన ఎల్లావుల మనోహర్ (20), షేక్ మస్తాన్ మోటార్‌సైకిల్‌పై కావలి వస్తూ పెద్దపవని రోడ్డు వద్ద మలుపు తిరుగుతున్నారు. ఈ క్రమంలో జలదంకి నుంచి గూడూరు సంతకు గొర్రెల లోడుతో బయలుదేరిన వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కావలి ప్రాంతీయ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మనోహర్ మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. షేక్ మస్తాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ
IV
నెల్లూరు
శనివారం ॥ 19-8-2023

"ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ...
ఏమేమి కాయొప్పనే గౌరమ్మ!
తంగేడు పువ్వులో... తంగేడు కాయలో...
ఆట చిలుకలు రెండు... పాట చిలుకలు రెండు..."

* * *

"చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దులగుమ్మ
బంగారు బొమ్మ దొరికేనమ్మా ఈ వాడలోన..."



న్యూజెర్సీలో బతుకమ్మ వేడుక (ఫైల్ ఫోటో)

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో! అమెరికా బతుకమ్మ ఉయ్యాలో!!

"ఇలా ఒకటా... రెండా... లెక్కలేనన్ని బతుకమ్మ పాటలు మా నాలుకల మీద నాట్యమాడుతుంటాయి. గ్రామాల్లో గడిచిన బాల్యం జీవితాన్ని నేర్పుతుంది. తెలంగాణ గ్రామాల్లో బాల్యం బతుకమ్మ పాటల రూపంలో సమాజంలో జీవించడాన్ని నేర్పుతుంది. నిరక్షరాస్యులు కూడా ఈ పాటలను లయబద్ధంగా పాడతారు. బతుకమ్మ పాటల సాహిత్యం వాళ్ల నాలుకల మీద ఒదిగిపోయింది. తమకు తెలిసిన చిన్న చిన్న పదాలతో జీవితాన్ని అల్లేశారు గ్రామీణ మహిళలు. మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీర్. మా అమ్మమ్మ గారి ఊరు జగిత్యాల జిల్లా, వెలుగుమాట్ల. నా చదువు పుట్టపర్తిలో, సెలవులు అమ్మమ్మ ఊరిలో. దసరా సెలవులు వస్తున్నాయంటే సంతోషం అంతా ఇంతా కాదు. దేశమంతా దేవీ నవరాత్రులు జరుపుకుంటూ ఉంటే మేము బతుకమ్మ వేడుకలు చేసుకుంటాం. గౌరమ్మ అందరి మనసుల్లో కొలువుంటుంది, మాట, పాట, ఆట అన్నీ గౌరమ్మ కోసమే అన్నట్లు ఉంటుందీ వేడుక. ఇంత గొప్ప వేడుకకు దూరమయ్యానని అమెరికా వెళ్లిన తర్వాత కానీ తెలియలేదు. అందుకే అమెరికాలో బతుకమ్మను పేర్చాను'' అన్నారు దీప్తి మామిడి... కాదు, కాదు, బతుకమ్మ దీప్తి.



దీప్తి మామిడి

"నేను 2007లో యూఎస్‌కి వెళ్లాను. న్యూజెర్సీలో ఉండే వాళ్లం. పెళ్లయి, ఒక బిడ్డకు తల్లిని. భర్త, పాప, ప్రొఫెషన్‌తో రోజులు బిజీగా గడిచి పోయేవి. డబ్బు కూడా బాగా కనిపించేది. కొద్ది నెలల్లోనే... ఏదో మిస్సవుతున్నామనే బెంగ మొదలైంది. వ్యాక్యూమ్ ఏమిటనేది స్పష్టంగా తెలియలేదు, కానీ బాల్యం, సెలవుల్లో బతుకమ్మ వేడుక మరీ మరీ గుర్తుకు వస్తుండేది. బతుకమ్మ కోసం ఇండియాకి రావడం కుదరక పోతే నేనున్న చోటే బతుకమ్మ వేడుక చేసుకోవచ్చు కదా! అనిపించింది. అలా అక్కడున్న తెలుగువాళ్లను ఆహ్వానించి బతుకమ్మ వేడుక చేశాను. మొదటి ఏడాది పదిహేను మందికి లోపే... పదేళ్లు దాటేసరికి ఆ నంబరు ఐదారు వందలకు చేరింది. అందరికీ భోజనాలు మా ఇంట్లోనే. ఏటా ఒక పెళ్లి చేసినట్లు ఉండేది. ఇండియా నుంచి తెలంగాణ పిండివంటలను తెప్పించుకోవడం, ఆ రోజు వండుకోవాల్సినవన్నీ మా ఇంట్లోనే వండడం, ఆ వంటల కోసం దినుసులను సేకరించడం, స్నేహితులందరినీ ఆహ్వానించడం, పూలు తెచ్చుకుని ఒక్కొక్కటీ పేర్చడం... ఇలా ప్రతి ఘట్టాన్నీ ఎంజాయ్ చేసేదాన్ని. 'ఏటా అంతంత ఖర్చు ఎందుకు' అని స్నేహితులు అనేవాళ్లే కానీ మా వారు ఒక్కసారి కూడా అడగలేదు. నా సంతోషం కోసం చేసుకుంటున్న ఖర్చు అని అర్థం చేసుకునేవారు.

ఎప్పుడూ అన్నం ఉంటుంది!

యూఎస్‌లో మా ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద ఎప్పుడూ అన్నం, కూరలుండేవి. మా కన్సల్టెన్సీకి వచ్చిన వాళ్లు, ముఖ్యంగా బ్యాచిలర్స్ కోసం ఈ ఏర్పాటు. మేము యూఎస్‌లో అడుగుపెట్టిన కొన్నాళ్లకే రెసిషన్ వచ్చింది. అప్పుడు పడిన ఇబ్బందులు నాకిప్పటికీ గుర్తే. అందుకే యూఎస్‌కి వచ్చిన కుర్రాళ్లు మన తెలుగింటి రుచులతో భోజనం చేస్తారు కదా! అనుకునేదాన్ని. షడ్రసోపేతమైన భోజనం అని కాదు కానీ కనీసం పప్పు చారయినా ఉండేది. ఈ అలవాటుకు బీజం పడింది కూడా అమ్మమ్మ దగ్గరే. అమ్మమ్మ పెద్ద పాత్రలో అంబలి చేయించి ఇంటి ముందు పెట్టేది. చాలామంది పొలం పనులకు వెళ్తూ దారిలో మా ఇంటి ముందాగి అంబలి తాగి, ఆవకాయ ముక్క చప్పరించుకుంటూ వెళ్లేవాళ్లు. ఆకలి తీర్చడంలో, అవసరమైన వాళ్లకు సహాయం చేయడంలో ఉండే సంతృప్తి మరి దేనిలోనూ ఉండదు. మా డ్రైవర్ ఇతర పనివాళ్ల పిల్లల చదువు కోసం ఫీజులు కట్టినప్పుడు మరొకరి జీవితానికి మనవంతు సహాయం చేస్తున్నామనే భావన సంతృప్తినిస్తుంది. అవకాశం లేనప్పుడు ఎలాగూ చేయలేం, వెసులుబాటు ఉన్నప్పుడయినా చేసి తీరాలి. మన ఎదుగుదల కోసం సమాజం నుంచి మనం తీసుకుంటాం, మనం ఎదిగిన తరవాత మరొకరి ఎదుగుదల కోసం ఆపన్న హస్తాన్ని అందించి తీరాలనేది పుట్టపర్తి స్కూల్ నేర్పించిన వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్. మా అమ్మ ఫ్రెండ్ లీలా ఆంటీ కూడా బతుకమ్మ పండుగను బాగా చేసేవారు. ఆమె ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్. గునుగుపూలు వాటర్‌బాడీస్‌ని శుద్ధి చేస్తాయని చెప్తూ ఈ పండుగ వెనుక ఉన్న పర్యావరణ పరిరక్షణను వివరించేవారు. ఇవన్నీ మైండ్‌లో ఒక్కటొక్కటిగా అల్లుకుంటూ ఇలా దండ కూర్చుకున్నాయి.

బతుకమ్మ దీప్తినయ్యాను!

యూఎస్ జీవితం నాకు చాలా నేర్పించిందనే చెప్పాలి. అక్కడ అన్నీ ఉంటాయి కానీ ఏదో లేదనే వెలితి. రొటీన్ లైఫ్‌ని జాయ్‌ఫుల్‌గా మలుచుకోవడానికి నాకు బతుకమ్మ ఒక దారి చూపించింది. అప్పట్లో యూఎస్ ఇంతగా ఇండియనైజ్ కాలేదు. ఇప్పుడైతే న్యూజెర్సీ, డాలస్‌తోపాటు కొన్ని నగరాలు పూర్తిగా భారతీయలవే అన్నట్లు, తెలుగువాళ్ల ఊళ్లే అన్నట్లయిపోయాయి. మన పండుగలు ఇప్పుడు అందరూ చేసుకుంటున్నారు. నేను మొదలుపెట్టడంతో నేను బతుకమ్మ దీప్తినయ్యాను. 'దీప్తి మామిడి'గా అమెరికాలో అడుగుపెట్టాను. మూడేళ్ల కిందట తిరిగి వచ్చేటప్పటికి నా పేరు 'బతుకమ్మ దీప్తి'గా మారింది. బతుకమ్మ పాటకు మ్యూజిక్ మొదలైతే చాలు... ఒళ్లు పులకించిపోతుంది. పూనకం వచ్చినట్లే ఉంటుంది. మీతో మాట్లాడుతున్నా సరే... బతుకమ్మ ఫీల్ వచ్చేస్తుంది. చూడండి గూజ్‌బంప్స్ వచ్చేశాయి'' అని చేతులను చూపించారు బతుకమ్మ దీప్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

న్యూస్‌మేకర్ - లక్ష్మి

గిరిజన సరస్వతి

జె.ఇ.ఇ. ఎంట్రన్స్‌లో ర్యాంకు కొట్టడం సామాన్యం కాదు. అందుకై కొందరు రాజస్తాన్ వెళ్తారు. కొందరు హైదరాబాద్, విజయవాడ చేరుకుంటారు. తల్లిదండ్రులు గైడ్ చేస్తారు. కాని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు పుట్టిన కోయ విద్యార్థిని కొర్సా లక్ష్మి గురుకుల పాఠశాలలో చదువుకునే మంచి ర్యాంకు సాధించింది. పాట్నా ఐఐటీలో సీటు సాధించింది. కోయలలో ఒక అమ్మాయి సాధించిన స్ఫూర్తినిచ్చే విజయం ఇది. కొర్సా లక్ష్మి పరిచయం.

కొంతమంది ఇళ్లల్లో, నిజానికి చాలామంది ఇళ్లల్లో పిల్లలు జె.ఇ.ఇ. ఎంట్రన్స్ రాయడానికి తల్లిదండ్రులు చాలా శ్రద్ధ పెడతారు. బాగా చదివించే కోచింగ్ సెంటర్ కోసం అవసరమైతే రాజస్థాన్‌లోని కోటాకు వెళతారు లేదా హైదరాబాద్, విజయవాడలలో ప్రఖ్యాత కోచింగ్ సెంటర్‌లలో వేస్తారు. ఇక పిల్లలు ఇంట్లో ఉండి చదువుకుంటుంటే టీవీలు బంద్ చేస్తారు. మాటా పలుకూ లేకుండా పిల్లలు ఇరవై నాలుగ్గంటలూ చదువుకునేలా చేస్తారు. మెటీరియల్ తెచ్చిస్తారు. చాలా హైరానా పడతారు. అదేం తప్పు కాదు. కాని ఇలాంటివన్నీ లేకుండా కూడా కొంతమంది విజయం సాధిస్తుంటారు. కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుకున్న కోయ విద్యార్థిని కుర్సా లక్ష్మి అలాంటి విజేతే. పట్టుదలతో చదువుకుని ర్యాంకు సాధించిన విజేత.



తండ్రి కన్నయ్య, తల్లి శాంతమ్మలతో లక్ష్మి

ఐసులమ్మే తండ్రి కూతురు

కొత్తగూడెం నుంచి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన తండా కాటాయగూడెం. 300 గడపలున్న గ్రామం ఇది. అందరూ కోయలే. వ్యవసాయ కూలీలే. ఏ కొద్ది మందికో కాసింత భూమి ఉంటుంది. కొర్సా లక్ష్మి తండ్రి కన్నయ్యకు ఎకరం భూమి ఉంది. కాని వాన పడితేనే పండుతుంది. కన్నయ్య వ్యవసాయ కూలీగా వెళతాడు. తల్లి శాంతమ్మ కూడా. వ్యవసాయ పనులు లేనప్పుడు తన టీవీఎస్ ఎక్సెల్ మీద ఐస్ బాక్స్ పెట్టుకుని ఐసులమ్ముతాడు. ముగ్గురు పిల్లలు. కాని పెద్ద కొడుకు చదువు ఇష్టం లేక 7వ తరగతిలో ఇంట్లో నుంచి పారిపోయాడు. రెండో కొడుకు మామూలు చదువే. చివరి అమ్మాయి లక్ష్మి బాగా చదువుకోవాలని నిశ్చయించుకుంది.

పిన్ని స్ఫూర్తి

కన్న తల్లిదండ్రులు చదువు లేని వారు కావడాన లక్ష్మికి చదువులో ఏ సాయమూ చేయలేకపోయేవారు. ఆరవ తరగతి నుంచి కొత్తగూడెం గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న లక్ష్మికి పిన్ని సుమలత స్ఫూర్తిగా నిలిచింది. డిగ్రీ చదువుకున్న సుమలత హాస్టల్‌లో ఉన్న లక్ష్మిని తరచూ కలుస్తూ చదువు విలువ చెబుతూ వచ్చింది. డబ్బుకు విలువ ఇవ్వని వారు కూడా చదువుకు విలువ ఇస్తారని తెలిపింది. సెలవుల్లో ఇంటికి తీసుకువచ్చి లక్ష్మి మంచి చెడ్డలు చూసేది. ఆమె మాటలు లక్ష్మి మనసులో నాటుకుపోయాయి. 'ఏ రోజూ కూడా రాత్రి ఒంటి గంట లోపు లక్ష్మి పుస్తకం మూయగా చూడలేదు' అని లక్ష్మి బాబాయ్ రవి తెలిపాడు.

గురుకుల పాఠశాలలో

కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో దాదాపు వేయి మంది అమ్మాయిలు 6 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు వీరి చదువు మీద బాగా శ్రద్ధ పెడుతున్నారు. చురుకైన విద్యార్థినులను ఎంపిక చేసి జె.ఇ.ఇలో శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌లో ఎం.పి.సి తీసుకున్న లక్ష్మి 992 మార్కులు సాధించింది. దాంతో ఇంకా ఉత్సాహంతో జె.ఇ.ఇకి ప్రిపేర్ అయ్యింది. జె.ఇ.ఇ అడ్వాన్స్‌డ్‌లో 1371వ ర్యాంకు సాధించింది. పాట్నా ఐ.ఐ.టిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో మొన్నటి ఆగస్టు మొదటివారంలో సీటు పొందింది. గురుకుల పాఠశాల నుంచి ఈ ఘనత సాధించిన అమ్మాయి లక్ష్మే.

ఐ.ఏ.ఎస్ చేయాలని...

బాగా చదువుకుని ఐ.ఏ.ఎస్ చేయాలనేది తన లక్ష్యమని కొర్సా లక్ష్మి చెప్పింది. జె.ఇ.ఇలో మంచి ర్యాంకు సాధించి ఐ.ఐ.టిలో సీటు పొందడంతో ఐ.టి.డి.ఏ అధికారులు లక్ష్మిని ప్రశంసించారు. ట్యాబ్ ఇచ్చి ఆర్థిక సహాయం చేశారు. లక్ష్మి ఇంత బాగా చదవడంతో ఇంకా కొంతమంది ఆమె చదువును ప్రోత్సహించడానికి ముందుకొచ్చారు. ఆ ప్రోత్సాహం వల్ల లక్ష్మి ఐ.ఏ.ఎస్ చదివి పేద వర్గాల కోసం పని చేయాలని నిశ్చయించుకుంది.



నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే

వారియర్ కెమెరా

● కర్తవ్యాన్ని గుర్తు చేసే కెమెరా కన్ను

ఆరతి కెమెరాతో మాట్లాడి చూడండి...
చేపల సవ్వడి లేని నదుల దీనత్వాన్ని గురించి చెబుతుంది.
చేవ లేని జీవజాలాన్ని గురించి చెబుతుంది.
పచ్చదనాన్ని కోల్పోయి నేలకూలనున్న నిర్జీవ వృక్షాల మృత్యుఘోష చెబుతుంది.
నదుల నీటిలోని విషాన్ని గురించి వివరంగా చెబుతుంది.
స్థూలంగా చెప్పాలంటే...కనిపించే అందాల వెనుక కనిపించని నిశ్శబ్ద విధ్వంసాన్ని గురించి కళ్లకు కడుతూ చెబుతుంది.

బెంగళూరుకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్ ఆరతి కుమార్ రావు తన కెమెరాతో పర్యావరణ సంరక్షణం గురించి క్షణం క్షణం గుర్తు చేస్తోంది...

ప్రతి కెమెరాకు ఒక దృష్టి ఉంటుంది. మరి ఆరతి కెమెరా చూసేది ఏమిటి?

అట్టడుగున పడి కన్పించని కథలు, నిజజీవిత కథలు, పట్టించుకోవాల్సిన అవసరం ఉన్నా ఎవరూ పట్టించుకోని కథలు, సంప్రదాయ జీవనశైలులు, వాటిలో వస్తున్న అనూహ్య మార్పులు, పదాలకు దొరకని దృశ్యాలు...ఇలా ఎన్నో ఎన్నెన్నో.

చిన్నప్పటి నుంచి 'నేషనల్ జియోగ్రఫీ' పత్రికలను చూస్తూ పెరిగింది ఆరతి. ఆ ఎల్లో బార్డర్ విండోస్ నుంచి విశాలమైన ప్రపంచాన్ని చూసింది. ఆ పత్రికలోని ఫొటోగ్రాఫ్స్ తనపై ఎంతో ప్రభావం చూపాయి. పదాలతోనే కాదు చిత్రాలతో కూడా గొప్ప సత్యాలు చెప్పవచ్చుననే విషయం అర్థమైంది.


చిన్నప్పటి నుంచి ఫిజిక్స్ అంటే ఇష్టం ఉన్న ఆరతి బయోఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసింది.



ఆరతి కుమార్ రావు


ఆ తరువాత 'లైఫ్‌టైమ్ టు-డూ' రూపంలో భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంది. దానిలో నదులతో పరిచయం ఒకటి. నదులను, వాటి చుట్టూ ఉండే జీవితాన్ని ఫొటోల రూపంలో డాక్యుమెంట్ చేయాలనుకుంది.

కాళ్లకు బలపాలు, కళ్లకు కెమెరాలు కట్టుకొని ఊరూరు తిరిగినా తల్లిదండ్రులు ఎప్పుడూ అభ్యంతర పెట్టలేదు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వివిధ ప్రాంతాలలో తన ఫొటోగ్రఫీకి సంబంధించిన విషయాలను కుటుంబసభ్యులతో పంచుకునేది ఆరతి.



ఫొటోల ద్వారా ఎన్విరాన్‌మెంటల్ స్టోరీ టెల్లింగ్‌లో నేర్పు సంపాదించిన ఆరతి తన ప్రయాణంలో ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. పర్యావరణం గురించి మాట్లాడే వారిని అభివృద్ధి వ్యతిరేకులుగా భావించే వారిని కూడా చూసింది.

'రివర్ డైరీస్' అనేది ఆమె ప్రస్థానంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌గా పేరు తెచ్చుకుంది. నదుల అందాలతో పాటు వాటికి ఎదురవుతున్న ఆపదలకు 'రివర్ డైరీస్' అద్దం పడతాయి.





చిత్రాలు: ప్రకృతి, ప్రకృతితో ముడిపడిన మనిషి జీవితం

'హింస, వివాదాలు మాత్రమే హెడ్‌లైన్స్‌గా కనిపిస్తాయి. అయితే పర్యావరణ విధ్వంసం అనే భయానకమైన కనిపించని హింస చాపకింద నీరులా కొనసాగుతుంది' అంటుంది ఆరతి. ఆ కనిపించని హింసమూలాలను నలుగురికి తెలియజేసేలా చేయడంలో తన కెమెరాను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటోంది.

ఆరతి ఫొటోగ్రాఫర్ మాత్రమే కాదు రచయిత్రి కూడా. ఆమె పుస్తకాలలో 'మార్జిన్‌ల్యాండ్స్: ఇండియన్ ల్యాండ్‌స్కేప్స్ ఆన్ ది బ్రింక్' ఒకటి. ఇందులో లడఖ్ నుంచి సుందరబన్ వరకు ప్రకృతికి సంబంధించిన ఎన్నో సుందరచిత్రాలను కళ్లకు కడుతుంది. గంగ-బ్రహ్మపుత్ర-మేఘన పరీవాహక ప్రాంతాలకు తీసుకువెళుతుంది. భౌగోళిక అందాలతో పాటు ఎదురవుతున్న ప్రమాదాలను, అక్కడి ప్రజలు మాట్లాడుకునే పదాలను పరిచయం చేస్తుంది.

'నిర్మాణాలు, ఇతరత్రా విధ్వంసక కార్యకలాపాల వల్ల ప్రమాదం అంచున ఉన్న ప్రకృతిని కాపాడు కోవడం అనేది మన చేతిలోనే ఉంది' అని ఈ పుస్తకం ద్వారా చెబుతుంది ఆరతి.

'పర్యావరణంలో వచ్చే మార్పులు, అవి మన జీవితాల్లో తెచ్చే మార్పులను నా కెమెరా ద్వారా ఇక ముందు కూడా కథలుగా చెప్పాలనుకుంటున్నాను' అంటోంది ఆరతి.

ఒకానొక సందర్భంలో తన నిరసన గళాన్ని ఇలా వినిపించింది ఆరతి,,,,

'కరువుకాటకాలు, వరదలలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రమే పర్యావరణ విధ్వంసం, పరిరక్షణ గురించి మాట్లాడుకుంటారు. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు మునిగిపోతారు'

అయితే ఆరతిలాంటి ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్‌లు తమ చిత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి మన కర్తవ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూనే ఉన్నారు.

కవితకేదీ కాదు అనర్హం అన్న చందాన మెటల్, ప్లాస్టిక్, పాత గాడ్జెట్స్ ఏదైనా ఆయన చేతిలో పెట్టారంటే అందమైన శిల్పంగా మారాల్సిందే. అరవైఏళ్ల వయసులో చిన్నప్పటి హాబీని కెరీర్‌గా మలుచుకున్నాడు విశ్వనాథ్ మల్లాబ్బి దావంగిరె. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్‌గా మార్చి అబ్బురపరుస్తున్నాడు ఈ పెద్దాయన.

ఈ-వేస్ట్ శిల్పి



విశ్వనాథ్

బెంగళూరుకు చెందిన విశ్వనాథ్ తండ్రి డీఎమ్ శంభు ప్రముఖ శిల్పి ఇంకా పెయింటర్ కూడా. విశ్వనాథ్ మెడిసిన్ చదివి మంచి డాక్టర్ కావాలని శంభు కలలు కనేవారు. చిన్నప్పటి నుంచి సెకండ్ హ్యాండ్ వస్తువులను సరికొత్తగా మార్చడమంటే విశ్వనాథ్‌కు ఆసక్తి ఎక్కువ. ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని నిర్ణయించుకున్నాడు.

చదువు పూర్తైన తరువాత తరువాత మీడియాలోకంప్యూటర్ వీడియో గ్రాఫిక్ ఆర్టిస్ట్‌గా చేరాడు. అలా కెరీర్ ప్రారంభించిన విశ్వనాథ్ ఒక్కోమెట్టు ఎదుగుతూ విప్రోలో చేరాడు. ఇక్కడ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూనే ఖాళీ సమయం, వారాంతాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకోఆర్ట్‌గా ఎలా మార్చాలని పరిశోధిస్తుండేవాడు. రకరకాల ప్రయోగాల తరువాత.. గాడ్జెట్స్ వ్యర్థాలను ఉపయోగించి చిన్నచిన్న జంతువులు తయారు చేశాడు. అవి ముద్దుగా ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో తన ఇకో ఆర్ట్‌ను పెంచుకుంటూ పోయాడు.



ఫ్యాషన్ జ్యూవెలరీ నుంచి అందమైన శిల్పాలు, రోబోలదాకా అన్ని ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నాడు.


ఏరికోరి ఎంచుకుని...

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రాణాంతకంగా మారాయని తెలుసుకుని ఇకో ఆర్ట్‌ను మరింత సీరియస్‌గా తీసుకున్నాడు విశ్వనాథ్. ఈ క్రమంలోనే ఈ వ్యర్థాలను కొనుక్కునేవాడు. అన్నింటిని గంపగుత్తగా కొనకుండా కంప్యూటర్ విడిభాగాలు, ల్యాప్‌టాప్స్, డేటా కార్డులు, డీవీడీ, వీసీఆర్, ఫ్లాపీ డ్రైవ్స్, సెట్-టాప్‌బాక్స్‌లు, ల్యాండ్‌లైన్, కార్డ్‌లెస్ ఫోన్‌లు, గ్లూకో మీటర్లను ఏరికోరి ఎంచుకుని తీసుకునేవాడు. వీటిలో కూడా రాగి, బంగారం, రంగు రంగుల వైర్లు, కీబోర్డులను ప్రత్యేకంగా సేకరించి రకరకాల బొమ్మల రూపకల్పనకు ఉపయోగిస్తున్నాడు. ఆరు అడుగుల అమ్మాయి రూపంతో విగ్రహం, ప్రముఖ వ్యాపారవేత్త అజీం ప్రేమ్‌జీ ఫోటో, ఇకో జ్యూవెలరీ, కీబోర్డు కామధేనువు వంటి బొమ్మలు ఐదు వందలకు పైగానే తయారు చేశాడు.









హాబీని కెరీర్‌గా...

విశ్వనాథ్ తయారు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా అందంగా ఆకట్టుకుంటుండడంతో విక్రయించడం మొదలు పెట్టాడు. రెండేళ్ల క్రితం రిటైర్ అయిన విశ్వనాథ్.. తొలినాళ్లల్లో హాబీగా ఉన్న ఇకోఆర్ట్‌ను పూర్తి సమయం కేటాయిస్తూ ఇకోఆర్ట్ వస్తువులు విక్రయిస్తూ సరికొత్త కెరీర్‌ను సృష్టించుకున్నాడు. ఇకోఆర్ట్ వస్తువులు కొనే కస్టమర్లు ఢిల్లీలోనేగాక, యూరప్, నెదర్లాండ్స్, అమెరికా వంటి దేశాల్లో ఇకో ఆర్ట్ కోసం కస్టమర్లు ఎగబడుతున్నారు. దేశంలోనేగాక విదేశాల్లో తన ఇకో ఆర్ట్‌ను ప్రదర్శిస్తూ మంచి ఆదరణ పొందుతున్నాడు.



వందల కేజీలపైనే...

కీబోర్డు కీల నుంచి గోడగడియారంలో భాగాల వరకు అన్నీ సేకరించి ఇకో ఆర్ట్ రూపొందిస్తోన్న విశ్వనాథ్ ఇప్పటిదాకా రెండువందల కేజీల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్స్‌గా మార్చాడు. అయితే ఈ ఇకో ఆర్ట్ అంత సులభం కాదని విశ్వనాథ్ చెబుతున్నాడు. ''ఈ – వ్యర్థాల నుంచి ఆర్ట్ కావాల్సిన భాగాలను సేకరించి వాటికి ఆకారం, రంగు వేసి తుదిమెరుగులు దిద్దడానికి చాలా సమయం పడుతుంది. జ్యూవెలరీ తయారు చేయడానికి రెండు మూడు నిమిషాలు పడితే, శిల్పాలు తయారు చేయడానికి వారాలు, నెలలు పడుతుంది. అయినప్పటికీ ప్రస్తుతం రీసైక్లింగ్ చేసిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ఇటు కస్టమర్ల మనసు దోచుకోవడంతోపాటూ, పర్యావరణానికి హానీ కలగకుండా ఈ ఇకోఆర్ట్ ఎంతో సంతృప్తినిస్తుంది. ముందు ముందు మరిన్ని కళారూపాలు తీసుకురానున్నాను''అని విశ్వనాథ్ చెబుతున్నాడు.

జిల్లాలో ఓటర్ల సర్వే 84.35 శాతం పూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2024లో భాగంగా జిల్లాలో చేపడుతున్న ఇంటింటి సర్వే 84.35 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం చేపట్టిన ఇంటింటి సర్వే పురోగతిని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీలోగా ఓటర్ల సర్వే వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి చనిపోయిన ఓటర్లను తొలగించాలని సూచించారు. ఇల్లు మారిన, వలస వెళ్లిన ఓటర్లకు చిరునామాకు సంబంధించి నోటీసులు జారీ చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించిన తరువాతే జాబితా నుంచి తొలగించాలన్నారు. అర్హులైన ఏ ఒక్కరిని జాబితా నుంచి తొలగించవద్దని చెప్పారు. ఒకే ఇంటి నంబరుతో ఎక్కువ మంది ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కందుకూరు నియోజకవర్గ పరిధిలో ఇంటింటి సర్వే 91.87 శాతం పూర్తి చేయడంపై కందుకూరు సబ్‌కలెక్టర్, ఈఆర్‌ఓ శోభికను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కలెక్టర్ ఎం హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటి సర్వే 84.35 శాతం పూర్తయిందని సీఈఓకు తెలిపారు. బీఎల్‌ఓ యాప్‌లో 62.54 శాతం నమోదు చేశామని చెప్పారు. ఈ నెల 21లోగా 100 శాతం సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. ఇన్‌చార్జి డీఆర్‌ఓ పద్మావతి, కావలి ఆర్డీఓ శీనానాయక్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో మలబార్ షోరూం పునఃప్రారంభం



మలబార్ షోరూంను ప్రారంభిస్తున్న ద్వారకానాథ్, రూప్‌కుమార్

నెల్లూరు(బృందావనం): నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ఆధునికీకరించిన మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంను నగర డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ గత 9 ఏళ్లుగా నమ్మకం, నాణ్యతతో నెల్లూరీయుల ఆదరాభిమానాలు చూరగొంటున్న మలబార్ షోరూంను ఆధునికీకరించి పునఃప్రారంభించడం హర్షణీయమన్నారు. నెల్లూరు షోరూం ద్వారా ఆర్జించిన లాభాల్లో 5శాతం నగదును సామాజిక సేవ కార్యక్రమాల కోసం సీఎస్సార్ ఫండ్‌కు కేటాయించనున్నట్లు మలబార్ గోల్డ్, డైమండ్స్ చైర్మన్ ఎంపీ అహ్మద్ ప్రకటించడం హర్షణీయమన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ పీ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడారు. అత్యుత్తమ నాణ్యతతో, అసమానమైన హస్తకళలతో అంతర్జాతీయస్థాయికి ధీటుగా మలబార్ గోల్డ్,డైమండ్ ఆభరణాలను నెల్లూరీయులకు అందుబాటులోకి తేవడం హర్షణీయమన్నారు. మలబార్ చైర్మన్ ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ తమ షోరూంలో 4.9 శాతం నుంచి ప్రారంభమయ్యే అత్యల్ప తరుగు చార్జీలతో వినియోగదారులకు హాల్‌మార్క్ ఆభరణాలను అందిస్తున్నామని తెలిపారు. షోరూం పునఃప్రారంభం సందర్భంగా ఆభరణాల కొనుగోలుపై వెండి నాణేన్ని ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు.

మార్గదర్శిలో కొనసాగుతోన్న సోదాలు

- కార్యకలాపాలు యథాతథం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని నర్తకీసెంటర్, కరెంటాఫీసు సెంటర్ సమీపంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారుల ప్రత్యేక బృందాలు నిరంతరాయంగా సోదాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం ప్రారంభమైన సోదాలు శుక్రవారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. చందాదారుల వివరాలు, ఎంత మొత్తంలో నగదు వసూలు చేశారు? ఎంత చెల్లింపులు చేశారు? బ్యాలెన్స్‌షీట్లు, పన్నుల చెల్లింపులు, తదితర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డిపాజిట్లపై చెల్లిస్తున్న వడ్డీరేట్లపై ఆరాతీస్తున్నారు. కాగా సోదాల పేరిట సంస్థ రోజూ వారీ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారని, డబ్బులు కట్టడానికి వచ్చిన చందాదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, మార్గదర్శి సంస్థ ఉద్యోగులు కొందరు అసత్య ప్రచారాలకు తెరలేపారు. ఓ వైపు అధికారుల సోదాలు కొనసాగుతుండగా, మరోవైపు కార్యాలయంలో రోజూవారీ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగాయి.

బీర్ బాటిల్‌తో దాడి

- నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : పాతకక్షల నేపథ్యంలో పథకం ప్రకారం ఓ వ్యక్తితో మద్యం తాగించి ఆపై బీర్‌బాటిల్‌తో పొడిచిన ఘటనలో నిందితుడిని చిన్నబజారు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు పాతమున్సిపల్ కార్యాలయ సమీపంలో వి.అశోక్‌బాబు నివాసం ఉంటున్నారు. ఆయన ఏసీ కూరగాయల మార్కెట్లో పనిచేస్తున్నారు. 20 రోజుల కిందట ఓ ఫంక్షన్‌లో ఫణతులవారివీధికి చెందిన బంధువు ఎ.వెంకటేష్‌తో ఘర్షణ చోటుచేసుకుంది. దానిని మనస్సులో పెట్టుకున్న వెంకటేష్ ఈనెల 17న మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఓ బార్‌లో అశోక్‌బాబుతో పూటుగా మద్యం తాగించాడు. అనంతరం బీర్‌బాటిల్‌తో కడుపులో పొడిచి పరారయ్యాడు. తీవ్రగాయాలపాలైన అశోక్‌బాబు నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు వెంకటేష్‌ను శుక్రవారం అరెస్ట్ చేశారు.

మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఇంటర్ ఫెయిల్ అవడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలాజీనగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు..బాలాజీనగర్‌లోని గాడ్ హాస్టల్ సెంటర్‌లో సునీత కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె కుమారుడు మణికంఠ(19) ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. అప్పట్నుంచి లోలోపల మథనపడసాగాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన తల్లి బంధువుల సహకారంతో తలుపులు పగులగొట్టి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మణికంఠను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ మేరకు బాధిత తల్లి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అఖండ వేదపారాయణ సప్తాహం ఆరంభం

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో అఖండ వేదపారాయణ సప్తాహం శుక్రవారం ప్రారంభమైంది. పవిత్ర శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానాధీశ్వరులు జగద్గురు విద్యారణ్య భారతిస్వామి మంగళాశాసనాలతో అఖండ వేద పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టినట్లు ఆ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, ఆదిశంకర ధ్యాన మందిర కమిటీ అధ్యక్షుడు పారా గురువేంకట శ్రీధర్‌శర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా శ్రీఇరగవరం వేదశాస్త్ర పరిషత్తు వేదపండితులు, వేదసభాపతి బ్రహ్మశ్రీ గుళ్లపల్లి శివశర్మ ఆధ్వర్యంలో సప్తాహం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేదఘోష శ్రవణం,వేదాశీర్వచనం అఖండ ముక్తిదాయకమన్నారు.

ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు

నెల్లూరు(క్రైమ్): గుంటూరు రేంజ్ పరిధిలోని 13 మంది ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగులు కల్పిస్తూ ఐజీ జీ పాలరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల సీఐలుగా పదోన్నతి పొంది రేంజ్ కార్యాలయంలో ఉన్న పీ శ్రీనివాసరావును నెల్లూరు డీసీఆర్‌బీ, డీ వెంకటేశ్వరరావును నెల్లూరు సీసీఎస్, ఆవుల వెంకటేశ్వర్లును ఎస్సీ, ఎస్టీ సెల్–2, జీ వెంకటనారాయణను ఎస్సీ, ఎస్టీ సెల్–1 ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు.

ఈఓపీఆర్డీ నాగరాజు మృతదేహం లభ్యం

కొడవలూరు: మండల ఈఓపీఆర్డీ విశ్వాసం నాగరాజు(61) మృతదేహం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో లభ్యమైంది. బుధవారం సాయంత్రం ఈఓపీఆర్డీ కాశీలో గంగా నది ఘాట్లను సందర్శించే క్రమంలో ప్రమాదవశాత్తు పడవలో నుంచి జారిపడి గల్లంతైన విషయం తెలిసిందే. అప్పట్నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలిస్తుండగా ప్రమాదం జరిగిన చోట నుంచి 35 కి.మీ దూరంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో నాగరాజు మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని చూసిన నాగరాజు కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. నాగరాజు మృతి విషయం తెలుసుకుని కుటుంబసభ్యులకు ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పీ సురేష్‌కుమార్, ఏ రమేష్, పంచాయతీ కార్యదర్శులు పీ సురేష్‌కుమార్, బ్రహ్మానందరెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని వేడుకున్నారు.

పాడి రైతులకు పెయ్యదూడల ఉత్పత్తి పథకం



మాట్లాడుతున్న రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్

కలిగిరి: పాడి రైతులకు ఉపయోగపడే విధంగా పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కావలిముస్తాపురంలో గర్భకోశ వ్యాధులపై శుక్రవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెయ్యదూడల ఉత్పత్తి పథకంలో భాగంగా రైతులు రూ.500 చెల్లించి పెయ్యదూడల కోసం పాడి పశువులకు సెమెన్ వేయించుకోవచ్చని తెలిపారు. కావలిముస్తాపురం గ్రామాన్ని దత్తత తీసుకుని చూడి నిలిచిన పశువులకు మిశ్రమ దాణా, ఖనిజ లవణముల మిశ్రమం ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు టీ సోమయ్య, సురేష్, వసంతరాయులు, నరేష్, సర్పంచ్ సుబ్బానాయుడు, రైతులు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటం

ప్రముఖ పర్యాటక ప్రాంతం మైపాడు బీచ్‌ను సందర్శించేందుకు సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు నిత్యం తరలి వస్తుంటారు. పడవపై సాగరంలో షికారు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. దీన్ని కొందరు క్యాష్ చేసుకుంటున్నారు. నాటు పడవలపై షికారుకు తీసుకెళ్తూ వారి ప్రాణాలకు భద్రత లేకుండా వ్యవహరిస్తున్నారు. పడవపై సముద్రంలోకి వెళ్లే ప్రతిఒక్కరూ లైఫ్‌జాకెట్లు ధరించాలి. కానీ అలా చేయకుండా సాధారణంగా తీసుకెళ్తున్నారు. సముద్రంలోకి సందర్శకులను తీసుకెళ్లాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా వేటకు ఉపయోగించే నాటు పడవలను సముద్రంలో షికారుకు ఉపయోగించడం ఎంత వరకు సమంజసం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



మైపాడు బీచ్‌లో ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా సందర్శకులను నాటు పడవలో సముద్రంలోకి షికారుకు తీసుకెళ్తున్న దృశ్యం